క్లుప్తంగా

ముగిసిన ఆరాధనోత్సవాలు



ఆరాధనోత్సవాల్లో భాగంగా పూజలు చేస్తున్న సాయిసుందర్ మహరాజ్

విజయనగరం టౌన్: నగరంలోని లంక వీధిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు శనివారంతో ముగిశాయి. సద్గురు సాయి సుందరం మహరాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన ప్రత్యేక పూజలు, 23వ తేదీన ఆరాధనోత్సవాలు, అదేరోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం ఊరేగింపు, 24వ తేదీన ముగింపు కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తురాల శ్రీనివాస్ తెలిపారు. ముగింపు కార్యక్రమానికి జనసేన పార్టీ రాష్ట్ర నాయకురాలు పాలవలస యశస్విని హాజరై, స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు నీలకంఠేశ్వరరెడ్డి

గంట్యాడ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నీలకంఠేశ్వరరెడ్డి హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో శనివారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని, లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. డీలర్ల పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తామన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఎంపీడీవో చంద్రకళను సత్కరిస్తున్న ఎంపీపీ అనూషరెడ్డి, తదితరులు

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్తున్న ఎంపీడీవో జి.చంద్రకళను ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి, తదితరులు శనివారం సన్మానించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అంకితభావంతో విధులు నిర్వహించి, మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని ఎంపీపీ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో వెళ్తున్న చోట కూడా పనిచేసి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో అప్పలనాయుడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దాసరి బంగారయ్య, ఎంఈవో రమణమూర్తి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



ప్రశాంతి

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తాడ్డి ప్రశాంతి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. స్పోర్ట్స్ కోటాలో సదరు విద్యార్థినికి నూజివీడు కళాశాలలో సీట్లు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు శనివారం తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని ఆయన అన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

వంగర: చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నిర్మూలించేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని పాస్టర్ కె.డేవిడ్‌పాల్ కోరారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా మండలంలోని కొప్పర, బంగారువలస గ్రామాల్లో శనివారం ర్యాలీ చేపట్టారు. 'సేవ్ ద ఉమెన్' అంటూ నినాదాలు చేశారు. అత్యాచారాలకు పాల్పడిన వ్యక్తులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

షిఫ్ట్ ఆపరేటర్ సేవాభావం

వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నడుకూరు అశోక్ రక్తదానం చేసి ఒకరి ప్రాణాలు కాపాడారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత రక్తహీనతతో బాధపడుతోంది. ఆమెకు తక్షణమే రక్తం అవసరమని జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వాటిని చూసిన అశోక్ వెంటనే స్పందించారు. హుటాహుటిన పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఇప్పటికే మూడుసార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు, ట్రాన్స్‌కో అధికారులు ఆయనను అభినందించారు.

మహిళా సిబ్బందికి రక్షణ కల్పించాలి



ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది కోసం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలి. కోల్‌కతా లో ట్రైనీ వైద్యురాలి విషయంలో జరిగిన సంఘటన చాలా దారుణం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. ప్రజలకు ఎంతో సహనంతో వైద్యం అందించే మహిళా వైద్యులు, సిబ్బందిపై దాడులు చేయడం సరికాదు. రోగుల వెంట కొంతమంది సహాయకులు మద్యం సేవించి ఆస్పత్రికి వస్తుంటారు. వైద్య సేవలు అందించే సమయంలో సిబ్బందితో ఘర్షణలకు దిగుతుంటారు. విధుల్లో ఉన్న సిబ్బందితో దురుసుగా ప్రవర్తించే వారిని శిక్షించేలా చట్టాలు కఠినతరం చేయాలి. – బేబీ రాణి, స్టాఫ్ నర్స్, గుర్ల పీహెచ్‌సీ



సెక్యూరిటీ గార్డులను నియమించాలి



ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లకు రక్షణ కల్పించాలి. సెక్యూరిటీ గార్డులను నియమించాలి. రెస్ట్ రూమ్‌ల సదుపాయం కల్పించాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చిన్న వయస్సు నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలి. ఘటన జరిగిన క్షణాల్లో పోలీసులకు సమాచారం తెలిసే వ్యవస్థ రావాలి. కోల్‌కతాలో వైద్యురాలి హత్య చాలా బాధాకరం. ఇలాంటి ఘటనల్లో జాప్యం లేకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. తల్లిదండ్రులను చూసుకునే స్థాయికి వచ్చిన సమయంలో వైద్యురాలు హత్యకు గురి కావడం ఆ కుటుంబానికి తీరని లోటు. – దీప్తి, వైద్యాధికారి, గరివిడి పీహెచ్‌సీ

నిషేధం సాధ్యమేనా..?

- సెప్టెంబరు 5వ తేదీ నుంచి నగరంలో ప్లాస్టిక్ నిషేధం
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై ఆంక్షలు
- 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం సంచులు వాడొద్దు
- నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు



విజయనగరం: నగరంలో ప్లాస్టిక్ నిషేధం దిశగా చర్యలకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత రోజుల్లో చాలామంది ఎలాంటి వస్తువునైనా ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల్లో తెచ్చుకునేందుకు అలవాటు పడిపోయారు. పట్టుకోవడానికి తేలిగ్గా, ఎక్కడైనా ఉంచుకోవడానికి వీలుగా ఉండడంతో వాటిని వాడేందుకే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. అయితే దాని వినియోగం వెనుక పొంచి ఉన్న ప్రమాదాన్ని మాత్రం పసిగట్టలేకపోతున్నారు. వాటి వాడకం వల్ల కలిగే అనర్థాలపై పలుమార్లు అవగాహన కల్పించినా వాడకం ఆగడం లేదు. కేన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధి వస్తుందని ప్రజాసంఘాలు, స్వచ్ఛందసంస్థలు పదేపదే చైతన్యం కలిగిస్తున్నా ప్రజల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. ఎన్నో ఏళ్ల నుంచి పాలిథిన్ నిషేధం అమలులో ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో విచ్చలవిడిగా పాలిథిన్ సంచుల వినియోగం పెరిగిపోవడంతో రోజురోజుకూ మనుషులతో పాటు మూగజీవాలు కూడా ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. ఇప్పుడు మళ్లీ విజయనగరం నగరపాలకసంస్థ పరిధిలో పాలిథిన్, ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని నియంత్రించేందుకు మరోసారి అధికార యంత్రాంగం నిర్ణయించింది. సెప్టెంబరు 5వ తేదీ నుంచి ఈ నిషేధం చర్యలు అమలులోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ తరుణంలో ఈసారి అయినా నిషేధం పూర్తిస్థాయిలో అమలయ్యేనా అని ప్రశ్నిస్తున్నారు. అసలు నిషేధం సాధ్యమేనా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణానికి పెనుప్రమాదం..

పర్యావరణానికి పెనుప్రమాదంగా తయారైన పాలిథిన్, ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నిషేధిస్తూ 1986లో అప్పటి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని తీసుకువచ్చింది. అప్పట్లో ఈ చట్టాన్ని తూతూమంత్రంగా అమలు చేసి, వదిలేశారు. దీంతో ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, పాలిథిన్ సంచులు వినియోగిస్తున్నారు. విందు భోజనాలు, టీ దుకాణాలు, పెళ్లిళ్లల్లో వీటినే వాడుతున్నారు. వీటి అమ్మకాల ద్వారా వ్యాపారులు ఏటా రూ.లక్షలు సంపాదిస్తున్నారు. 50 మైక్రాన్ల మించి తయారు చేసిన గ్లాసులు, సంచుల్లో వేడి వస్తువులైన పాలు, టీ, కూరలు వేయడం వల్ల అందులో ప్లాస్టిక్ పొర కరిగి పదార్థాల్లో కలిసిపోయి శరీర అవయవాలను దెబ్బతీస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 120 మైక్రాన్ల మందం కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

తూతూమంత్రంగా తనిఖీలు..

విజయనగరంలో గతంలోనే ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నప్పటికీ స్థానిక అధికారులు నామమాత్రపు జరిమానాలు విధించి, చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వ్యాపారులు ఏ మాత్రం భయపడడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే జరిగే సమయంలో తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి, ర్యాంకుల కోసం ఆరాటపడుతున్న అధికారులు పూర్తిస్థాయి నిషేధంపై చర్యలు తీసుకోవడంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈసారి అయినా నిషేధం అమలు పక్కాగా చేస్తారా లేదా అని పలువురు అంటున్నారు.

15 రోజులే గడువు..

వాస్తవంగా ముందు ప్లాస్టిక్ సంచులను తయారు చేసే కంపెనీలపై చర్యలు తీసుకుంటే వినియోగాన్ని నివారించవచ్చని, అలా కాకుండా కొనుగోలు చేసి విక్రయిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవడం వల్ల ఫలితం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసలు ప్లాస్టిక్ వస్తువులు తయారు చేయకుండా ఉంటే వాటిని వాడే అవసరమే ఉండదన్నది చాలామంది అభిప్రాయం. ఇప్పటికే దుకాణాల్లో ఉండే స్టాకును విక్రయించేందుకు 15 రోజుల పాటు గడువు విధిస్తున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు.

పక్కాగా అమలు..

120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తుల అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వచ్చే నెల 5వ తేదీ నుంచి నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. ఇప్పటికే సంబంధిత విక్రయదారులతో సమావేశం నిర్వహించాం. ఉన్న వస్తువులను 15 రోజుల్లోగా ఖాళీ చేయాలని ఆదేశించాం. అనంతరం నిషేధం అమలుపై దాడులు ముమ్మరం చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం. –ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

చట్టం ఏం చెబుతోంది..

ప్లాస్టిక్ సంచులు విక్రయించడం, వినియోగించడంపై 1986లో చేసిన చట్టం ప్రకారం 20 మైక్రాన్‌లు కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్, పాలిథిన్ సంచులను విక్రయించకూడదన్నది నిబంధన చెబుతోంది. ఆ తర్వాత దాన్ని సవరిస్తూ 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం ఉన్న వాటిని వాడొద్దని సూచించారు. నిషేధిత వస్తువులు తయారు చేసినా, అమ్మినా, వాడినా జరిమానా విధించడంతో పాటు సంబంధిత దుకాణాన్ని సీజ్ చేసేలా కార్యాచరణ రూపొందించారు.

ప్రజలు సహకరించాలి..

పర్యావరణానికి పెద్ద శత్రువుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు ప్రజలు సహకరించాలి. స్వచ్ఛందంగా చైతన్యం పొంది వీటిని వినియోగించడం మానేస్తే సమాజానికి ఎంతో మేలు చేసినవారవుతారు. ఈ విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు కృషిచేయాలి.

ముగిసిన శిక్షణ



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

డెంకాడ: మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అటల్ అధ్యాపకుల అభివృద్ధి శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యూచర్ ట్రెండ్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఫర్ స్మార్ట్ సిటీస్‌పై ఈసీఈ, ఈఈఈ విభాగం అధ్యాపకులకు ఈ శిక్షణ ఇచ్చారు. విద్యుత్ శక్తి నిర్వహణలో తాజా ఆవిష్కరణలకు ఈ శిక్షణ దోహదపడుతుందని సమాచారం. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వినోద్‌కుమార్, రంజన్‌కుమార్ బెహరా, నిశాంత్‌కుమార్, ప్రిన్సిపాల్ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, డెవలప్‌మెంట్ ఆఫ్ రేడియో కమ్యూనికేషన్ ఇన్ ఇండియాపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ సోమక్ భట్టాచార్య విచ్చేసి, ప్రసంగించారు. చానల్ బ్యాండ్ విడ్త్ డిమాండ్ పెరుగుదల, రేడియో సైన్స్ కమ్యూనికేషన్‌లోని కొన్ని ఆధునిక అంశాలు, పోకడలపై మాట్లాడారు.

మిగులు సీట్ల భర్తీకి చర్యలు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్లలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పలు తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఐదో తరగతిలో 49, ఆరో తరగతిలో 23, ఏడో తరగతిలో 6, ఎనిమిదో తరగతిలో 14, తొమ్మిదో తరగతిలో 8, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 41 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల 30వ తేదీలోగా ధ్రువపత్రాలతో పాఠశాలను సంప్రదించాలన్నారు.

నెల్లిమర్ల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ కె.ఉషారాణి ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఐదో తరగతిలో 21, ఆరో తరగతిలో 4, ఎనిమిదో తరగతిలో 4, తొమ్మిదో తరగతిలో 1, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 60 సీట్లు ఉన్నాయని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులంతా సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 4గంటల్లోపు సంబంధిత ధ్రువపత్రాలను వెంట తీసుకువచ్చి, పాఠశాలలో సమర్పించాలన్నారు.

కల్యాణ మండపాన్ని ఆధునీకరిస్తాం..



శ్రీదేవీ దండుమారమ్మ కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కేంద్రంలోని శ్రీదేవీ దండుమారమ్మ కల్యాణ మండపాన్ని ఆధునీకరిస్తామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా కంటోన్మెంట్, కాళీ ఘాట్ కాలనీల్లోని కల్యాణ మండపాలను ఆయన శనివారం సందర్శించారు. గతంలో జిల్లా పోలీస్ శాఖ నిర్మించిన ఈ మండపాలను పోలీసులు నిర్వహించుకునే శుభ కార్యక్రమాలకు తక్కువ మొత్తానికి అద్దెకు ఇస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న వసతులకు అదనంగా ఏర్పాటు చేయాల్సిన అదనపు మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత సిబ్బందితో ఎస్పీ చర్చించారు. ఆయనే స్వయంగా మండపాల్లోని గదులు, ప్రాంగణాలను పరిశీలించారు. మౌలిక వసతులు, అదనపు గదుల నిర్మాణం, పెయింటింగ్స్ వంటి అభివృద్ధి పనులతో పాటు ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఆధునీకరించేందుకు అవసరమైన పనులకు అంచనా వ్యయాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఎస్బీ సీఐ విజయనాథ్, ఆర్ఐలు ఎస్.గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లాటరీ ద్వారా గృహాల కేటాయింపు



లబ్ధిదారులతో లాటరీ తీయిస్తున్న అధికారులు

విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో లంకాపట్నం ప్రాంతంలో హుద్‌హుద్ తుపాను బాధితుల కోసం నిర్మించిన గృహ సముదాయంలోని 78 ఇళ్లను లాటరీ ద్వారా లబ్ధిదారులకు శనివారం కేటాయించారు. గృహనిర్మాణ శాఖ, నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన లాటరీలో వచ్చిన సంఖ్య ఆధారంగా గృహాలు అప్పగించారు. నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపాను కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి ఈ గృహ సముదాయం నిర్మించడం జరిగిందని, మొత్తం 432 గృహాలు నిర్మించగా వాటిలోని 209 గృహాలను లబ్ధిదారులకు గతంలో అందించామని, ఇప్పుడు మరో 78 గృహాలను లబ్ధిదారులకు ఇచ్చామన్నారు. మిగిలిన ఇళ్ల ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించి, వాటిని కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. లాటరీ విధానం పూర్తి పారదర్శకంగా ఉండేలా లబ్ధిదారులతోనే ఎంపిక ప్రక్రియ చేపట్టామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఏవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గంట్యాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ(వృక్షశాస్త్రం) గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్.వి.ఎస్.జగన్నాథరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు.

బోటనీ సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ పాసైన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు విద్యార్హత ధ్రువపత్రాలు, బయోడేటా, ఫొటోతో కళాశాలను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు 'మేమున్నాం'



విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: కంటోన్మెంట్ పరిధిలోని హిందూ నగరపాలక ప్రాథమిక పాఠశాలలోని 82 మంది విద్యార్థులకు దాతలు వితరణ చేసిన తెలుగు, ఆంగ్లం కాపీ రైటింగ్ పుస్తకాలతో పాటు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటి విద్యాసామగ్రిని మేమున్నాం అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కె.సత్యనారాయణమూర్తి శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి పటిష్టమైన పునాది విద్యేనని, నిరుపేద విద్యార్థులకు తమ సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. దాతలైన సేనాపతి ఈశ్వరరావు, గరిమెళ్ల రమేష్‌లకు తన ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. కార్యక్రమంలో డోకి చంద్రశేఖర్, అఖిల, కార్తీక్, ప్రధానోపాధ్యాయురాలు జె.లలితకుమారి, ఉపాధ్యాయులు కె.అవతారం, సంధ్యారాణి, బి.భారతి, డి.మజ్జిగౌరి, కె.సునీత పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఇటీవల ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని కిమిడి రాజేశ్వరిని ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. ఉన్నత విద్య అభ్యసించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ విద్యార్థినిక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, అదపాక దామోదరదరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేద్దాం..
అంధులకు చూపునిద్దాం..

- మరణించినా.. మరికొందరికి లోకం చూపించే అదృష్టం
- అపోహలు వీడి నేత్రదానానికి ముందుకురావాలని పిలుపు
- నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



సత్యవతి నేత్రాలను సేకరిస్తున్న వైద్యుడు (ఫైల్)

రాజాం సిటీ: సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. జ్ఞానేంద్రియాలన్నింటిలోను ప్రధానమైనవి కళ్లు. వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. మనం మరణించినా మన కళ్లతో మరో ఇద్దరికి ఈ లోకాన్ని చూపే అదృష్టం నేత్రదానంతోనే సాధ్యం. నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి. కంటి చూపు లేక చీకట్లో మగ్గుతున్న వారెందరికో కంటి చూపును ప్రసాదించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి నేత్రదానం చేయాలి.

నేత్రదానం ఎవరికి అవసరం..

కంటిలోని కార్నియాపైన మచ్చలు ఉన్నవారికి నేత్రదానం అవసరం. నల్లగుడ్డుపై మచ్చలు ఏర్పడడానికి ప్రధానంగా చిన్నారుల్లో పోషకాహార లోపం, మీజిల్స్, సంక్రమణ కంటి వ్యాధులు, గాయాలు బారిన పడడం, కంటి శస్త్ర చికిత్సలు అనంతరం ఇన్ఫెక్షన్స్ సోకడం, పుట్టుకతో వచ్చే కంటి వ్యాధులు కారణంగా చూపు దెబ్బతిన్నవారికి అవసరం. ఈ నేత్రదానంపై అపోహలు ప్రజల్లో తొలగించేందుకు 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 9వరకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ఎవరైనా నేత్రదానం చేయవచ్చు..

నేత్రదానం చేయడానికి వయసుతో పనిలేదు. ఏ వయసు వారైనా నేత్రదానం చేయవచ్చు. కళ్లజోడు పెట్టుకునేవారు, అధిక బీపీ, మధుమేహం, ఉబ్బసం వ్యాధులు ఉన్నవారు, కంటి శుక్లాలు (క్యాటరేక్ట్) ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా చేయవచ్చు. నేత్రదానంలో కంటిలోని కార్నియాను, శరీరం నుంచి పది మిల్లీమీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు. అలాగే ఎయిడ్స్, పచ్చకామెర్లు, కుక్క కాటు, బ్లడ్ క్యాన్సర్, సెప్టీసిమీయా వ్యాధులతో చనిపోయిన వారి కళ్లు దానానికి పనికిరావు.

ఇవి పాటించడం తప్పనిసరి..

వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయాలి. ఐ బ్యాంకు డాక్టర్‌గాని, శిక్షణ పొందిన టెక్నీషియన్ మాత్రమే స్టెరైల్ పద్ధతిలో కార్నియాను బయటకు తీస్తారు. వీరు మృతదేహం ఉంచిన చోటుకే వచ్చి రక్తస్రావం లేకుండా 15 నుంచి 20 నిమిషాల్లో కళ్లు సేకరిస్తారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను దానం చేయాలనుకుంటే రెండు కంటి రెప్పలు మూసివేసి, రెండు కళ్లమీద నీటిలో ముంచిన గుడ్డను వేయాలి. తలకింద దిండు పెట్టాలి.

కుటుంబ సంప్రదాయంగా చేసుకున్నాం..



నేత్రదానం మా కుటుంబ సాంప్రదాయంగా చేసుకున్నాం. ఇప్పటి వరకు మా కుటుంబంలో ఐదుగురు సభ్యులు మరణానంతరం నేత్రదానం చేశాం. ప్రతి ఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావడం ద్వారా ఎంతో మంది అంధులకు చూపును ప్రసాదించవచ్చు. – నప్పటి వసంతరావు, రొటేరియన్, ఆప్తాల్మిస్ట్, పెరుమాళి పీహెచ్‌సీ

మా అమ్మ కళ్లను దానం చేశాం..



ఇటీవల మృతి చెందిన మా అమ్మ బండి సత్యవతి కళ్లను శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఐ బ్యాంకుకు దానం చేశాం. ఆమె కళ్లు ఇప్పటికీ సజీవంగానే ఎక్కడో ఉన్నాయనే సంతృప్తి ఉంది. గతంలో మా కుటుంబంలో మా పెదనాన్న బండి తవిటినాయుడు కళ్లను కూడా దానం చేశాం. ఇటువంటి మంచి కార్యక్రమానికి మా కుటుంబం ముందుకురావడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి. – బండి నర్సింహులు, జెడ్పీటీసీ, పెనుబాక, రాజాం మండలం